# సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 12 । జనవరి । 2023




## డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం:గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 9,300క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2650,మధ్య డెల్టాకు 1750,పశ్చిమ డెల్టాకు 4900 క్యూసెక్కుల నీటిని వదిలారు.



## సత్యదేవుని దర్శించిన జిల్లా జడ్జి

అన్నవరం: కాకినాడ జిల్లా జడ్జి జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రత్నగిరి వాసుడు సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఆమె కు ఆలయం వద్ద పండితులు స్వాగతం పలికారు.

## సమష్టి కృషితో అంతర్వేది ఉత్సవాలు

సఖినేటిపల్లి: శాఖలన్నీ కలిసికట్టుగా పనిచేసి అంతర్వేది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని బుధవారం అంతర్వేదిలో జరిగిన సమీక్షలో మంత్రులు విశ్వరూప్..వేణు అధికారులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

జీవితంలో రిస్కు తీసుకో.. గెలిస్తే నాయకుడివి అవుతావు, ఓడితే మార్గదర్శకుడివి అవుతావు...

నిన్ను నువ్వు నమ్ముకో.. ప్రపంచమే నీ పాదాల చెంత ఉంటుంది.

నువ్వు బిజీగా ఉంటే ప్రతిదీ ఈజీనే... నీ నువ్వు ఈజీగా ఉంటే ఏదీ ఈజీ కాదు.

మందలో ఒకరిగా ఉండకు... వందలో ఒకరిగా ఉండటానికి ప్రయత్నించు.

ప్రయత్నం చేసి ఓడిపో.. కాని ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు

కెరటం నాకు ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు..

- స్వామి వివేకానంద

# యువతరం.. సేవాపథం



జీవితనౌకకు చుక్కానిలాంటి ఇటువంటి మాటలతో, స్ఫూర్తిదాయకమైన తన ప్రసంగాలతో జాతి ఖ్యాతి పతాకను విశ్వ వేదికలపై రెపరెపలాడించిన స్వామి వివేకానంద ఎందరికో ఆదర్శం. యువ చైతన్యమే సమాజానికి చోదక శక్తి అని వక్కాణించిన ఆయన భావనను నిజం చేస్తూ పలువురు సేవాపథంలో దూసుకుపోతున్నారు. నేడు జాతీయ యువజనోత్సవం (వివేకానంద జయంతి) సందర్భంగా అటువంటి సేవకులు, సంస్థల గురించి...

## ఆకలి తీర్చే 'ఎఫ్‌టీఎస్'



అమలాపురంలో ఓ నిరుపేద బాలికకు పుట్టినరోజు వేడుకను నిర్వహిస్తున్న ఎఫ్‌టీఎస్ వ్యవస్థాపకుడు రాంబాబు

అమలాపురం టౌన్: బండార్లంకకు చెందిన తులా లోకేశ్వర రాంబాబు ఓ ప్రైవేటు ఉద్యోగి. రెండున్నరేళ్ల కిందట అమలాపురం ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) ఫౌండేషన్‌ను ప్రారంభించాడు. 29 ఏళ్ల రాంబాబు పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసే ఓ బుక్స్ పబ్లికేషన్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. తమకు దొరికే ఫ్రీ టైమ్‌లో సేవ చేయడం వల్ల ఈ సంస్థకు ఫ్రీ టైమ్ సర్వీస్ అని పేరు పెట్టారు. కోవిడ్ సమయంలో ఆకలితో అలమటిస్తున్న నిరు పేదలను అన్వేషించి మరీ కడుపు నింపేవారు. అప్పుడే ఎఫ్‌టీఎస్ వాట్సాప్ గ్రూపును రూపొందించారు. సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు 1,500 మంది ఉన్నారు. ఇదే ఫౌండేషన్ పేరుతో తెరిచిన ఫేస్ బుక్‌లో 20 వేల మంది వీక్షకులు ఉన్నారు. ఇప్పుడు ఈ వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికగా ఆ ఫౌండేషన్ సేవలు విస్తరించాయి. కోనసీమలోనే కాకుండా హైదరాబాద్‌లో ఉన్న గ్రూపు సభ్యులు కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పుట్టిన రోజో, పెళ్లి రోజో, జ్ఞాపకార్థమో వారి ఆర్థిక స్తోమతను బట్టి కొంతమంది పేదలకు అన్నం పెట్టేందుకు ముందుకు వస్తూ ఈ ఎఫ్‌టీఎస్‌ను వేదికగా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 50 వేల మంది పేదల ఆకలి తీర్చినట్లు, ఓ అనాథాశ్రమం ఏర్పాటు చేయాలన్నదే తన లక్ష్యమని రాంబాబు చెప్పారు.

## చైతన్యం బోధిస్తున్న రాజు మాస్టర్



రిపబ్లిక్ డే సందర్భంగా గత ఏడాది పేదలకు వస్త్రదానం చేసిన జి.రాజు మాస్టర్

సామర్లకోట: స్థానిక యువకుడు జి.రాజు మాస్టర్ మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్‌ను ఏప్రిల్ 21, 2003లో ఏర్పాటు చేశారు. సావిత్రీబాయి పూలే, స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు, రిపబ్లిక్ డే సందర్భంగా పేదలకు వస్త్రదానం, గాంధీ వర్ధంతి, సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలామ్, నెహ్రూ, ఘంటసాల జయంతి, ఆగస్టు 15 వేడుకలు, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు సత్కారం, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉగాది పురస్కారాలు, అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా కార్యక్రమాలకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. పీజీ పూర్తి చేసిన రాజు మాస్టర్ పేదవారికి విద్య అందించాలనే లక్ష్యంతో తక్కువ ఫీజులతో కాన్వెంట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. జాతీయ నాయకుల చరిత్రను యువతకు తెలియజేయడానికి ఆయా నాయకుల జయంతి, వర్ధంతి సందర్భంగా ఉత్సవాలను నిర్వహించి యువతలో చైతన్యం కలిగిస్తున్నట్టు ఆయన 'సాక్షి'కి తెలిపారు.

## ఈ రక్త సంబంధానికి 24 ఏళ్లు!

కోటనందూరు: అవసరమైనప్పుడు రక్తం అందక విలువైన ప్రాణాలు పోతున్న విషయాన్ని గమనించిన కోటనందూరు మండలం బొద్దవరం గ్రామ యువత మనమే ఎందుకు రక్తదానం చేయకూడదని భావించారు. గ్రామానికి చెందిన యల్లపు దొరబాబు ఆధ్వర్యంలో యువకులందరూ కలిసి 1998లో శ్రీరామకృష్ణ సేవా సమితి పేరుతో రక్తదానం ప్రారంభించారు. రక్తదానంపై జనంలో పలు అపోహలు ఉన్న రోజుల్లోనే ఇక్కడ యువత రక్తదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గడచిన 24 ఏళ్లలో ఆ గ్రామానికి చెందిన సుమారు 100 మంది యువకులు ఇప్పటి వరకూ 7,170 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఇప్పటికీ దానిని కొనసాగిస్తున్నారు. బొద్దవరంలో ఉండే యువకులతో పాటు ఈ గ్రామానికి చెంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్న యువకులు సైతం రక్తదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 365 రోజులూ 24 గంటలూ ఏ సమయంలోనైనా ఏ గ్రూపు రక్తాన్ని కోరినా యువకులు సొంత ఖర్చులతో బాధితుల దగ్గర కెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. రక్తం ఇవ్వడానికి వెళ్లిన వారు ఆపదలో ఉన్నవారి దగ్గర నుంచి కనీసం మంచి నీళ్లు ఆశించరు. ఇదే గ్రామం నుంచి యువకుల స్ఫూర్తితో 65 మంది కళ్లను కూడా దానం చేశారు.



రక్తదానం చేస్తున్న బొద్దవరం యువత

## లవ్ టు సర్వ్



సమయమంతుల సాయిగణేశ్, ద్రాక్షారామ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన 22 ఏళ్ల యువకుడు సమయమంతుల సాయిగణేశ్ తన స్నేహితులు పసుమర్తి వంశీ విశ్వనాథన్, చెరుకు మధులతో కలసి ఐదేళ్ల క్రితం లవ్ టు సర్వ్ అనే సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు మొదలు పెట్టాడు. అనాథాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి అవసరమైన కిరాణా సరకులు, దుస్తులు, విద్యా సామగ్రి అందించడం మొదలు పెట్టారు. 2018 సంవత్సరం జనవరిలో ముగ్గురితో ప్రారంభమైన సంస్థ ప్రయాణం ప్రస్తుతం 250 మంది సభ్యులతో సాగుతోంది. సంస్థ ప్రెసిడెంట్ 22 ఏళ్ల పసుమర్తి వంశీ విశ్వనాథ్ ఇప్పటి వరకు 18 సార్లు రక్తదానం చేశాడు. వివేకానందుడు స్ఫూర్తిగా రక్తదానం, సామాజిక రుగ్మతలు, కరోనా వంటి విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో 2 వేల మందికి ఆహారం అందించారు. ఆకలి తీర్చడం, మాస్కుల పంపిణీ, 'ఫ్లాష్ మాబ్స్' పేరుతో యవతరానికి సోషల్ సర్వీస్ గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు. 500కి పైగా అవసరమైన వారికి రక్తదానం చేశారు. పేద మహిళలతో టైలరింగ్ షాపులు ప్రారంభించారు. శారీరక వైకల్యం కలిగి ఏ విధమైన ఆసరా లేని ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు.

## మన ఊరు - మన బాధ్యత అంటూ...

కాకినాడ రూరల్: ఇంద్రపాలెంలో మన ఊరు – మన బాధ్యత స్వచ్ఛంద సంస్థను దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ స్ఫూర్తితో మేడిశెట్టి రామమోహనరావు 2014 అక్టోబర్ 15న ప్రారంభించారు. గ్రామంలో మెరుగైన పారిశుధ్యం, పార్కు అభివృద్ధి, మొక్కలు నాటడం, మండల పరిషత్ స్కూల్‌ను దత్తత తీసుకుని పిల్లలకు బ్యాగులను పంచడం తదితర పనులు చేపట్టారు. ఈ సేవా కార్యక్రమాలకు యువకులే కాదు. చిన్నారులు, వృద్ధులు కూడా ఆకర్షితులై సేవా కార్యక్రమాల్లో పాల్గొని గ్రామానికి సేవ చేస్తున్నారు. నాడు ఆరు నుంచి నేడు 180కి చేరిన సభ్యులు గ్రామంలో రూ.18 లక్షలతో లైబ్రరీని అభివృద్ధి చేశారు. గ్రామస్తులు చెట్ల కింద కూర్చునేందుకు వీలుగా బెంచ్‌లు ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ విద్యార్థులకు ఫ్రీ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లిషు వంటి సదుపాయాలు కల్పించారు. సుమారు రూ.10 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు.




నేషనల్ యూత్ అవార్డు స్వీకరించిన సంతోషంలో సంస్థ సభ్యులు

ఈ సంస్థకు 2017– 18 సంవత్సరానికి గాను నేషనల్ యూత్ అవార్డు లభించింది. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ చేతుల మీదుగా 2021 ఆగస్టు 31న పురస్కారం అందుకున్నారు.

---

## న్యూస్‌రీల్

### అందుబాటులోకి కాల్ సెంటర్

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం సిటీ): సమీకృత కాల్ సెంటర్ 1967 ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని డీఎస్‌ఓ పి.ప్రసాదరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో పది మంది కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు ఉంటారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్ పంపిణీ, ధాన్యం కొనుగోలు, తూనికలు, కొలతలు, వినియోగదారుల హక్కుల రక్షణ తదితర అంశాలపై ప్రజలకు ఏమైనా సమస్యలుంటే కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన సమీకృత కాల్ సెంటర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

### మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా యూనిట్ల స్థాపన కోసం నిర్దిష్ట ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. పరిశ్రమలు, బ్యాంకర్ల, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 76 బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా 206 మంది మహిళలు వివిధ యూనిట్ల స్థాపనకు దరఖాస్తులు అందజేశారన్నారు. మొత్తం యూనిట్ ఖరీదు రూ.716 లక్షలు కాగా, లబ్ధిదారుల వాటాగా రూ.36 లక్షలు చెల్లించాలని, ప్రభుత్వం అందించే వివిధ సబ్సిడీల కింద సుమారు రూ.250 లక్షలు విడుదల చేయడం జరుగుతుందన్నారు. సమన్వయ శాఖలు, బ్యాంకర్ల మధ్య తరచూ సమావేశాలు నిర్వహించి, యూనిట్ల స్థాపనకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలపై సమీక్షించారు. సచివాలయాల పరిధిలో వాటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఎస్.రామ్‌మోహన్, సిడ్బ్ అధికారి కె.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం జి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్



విలేకరులతో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

దేవరపల్లి: రబీలో పండించిన ధాన్యాన్ని ఫిబ్రవరి నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. బుధవారం దేవరపల్లి వచ్చిన ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష జరిపారు. మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే పనుల పురోగతి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రబీ ఈ–పంట నమోదు చేయవలసి ఉందన్నారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయన్నారు. సీతానగరం, గోకవరం, కోరుకొండ, గోపాలపురం మండలాల్లో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభించినందున ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదన్నారు. ఈనెల 16 నాటికి పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 212 ఆర్బీకేల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించగా, కొనుగోళ్లు పూర్తయిన 148 కేంద్రాలను మూసి వేసినట్టు చెప్పారు. కొన్ని గ్రామాల్లో పండిన ధాన్యం కంటే ఎక్కువ కొనుగోలు చేశారని జాయింట్ కలెక్టర్ చెబుతూ, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ ఏడాది కొత్త విధానంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో ఆన్‌లైన్, మిల్లర్లు, దళారుల నుంచి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. గోనె సంచుల సరఫరా, రవాణా వంటి సమస్యలు కూడా వచ్చాయన్నారు. పది రోజుల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేస్తున్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే ఇబ్బందును తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ బాగా పనిచేసిందని, సుమారు 1000 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరిస్తున్నట్టు తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిరంతర ప్రక్రియ అని అన్నారు.

### ఎస్సీలకు అసైన్డ్ భూములు

గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను సర్వే చేసి, వాటిని ఎస్సీలకు పంపిణీ చేస్తామని జేసీ తేజ్‌భరత్ ప్రకటించారు. ఎస్సీల శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రతి గ్రామంలో అరెకరం నుంచి ఎకరం వరకూ భూమిని పంపిణీ చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నట్టు చెప్పారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో రీ సర్వేకు రెండు డ్రోన్ కెమెరాలను అందజేశామన్నారు. నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో డ్రోన్‌లను ఉపయోగించి రీ సర్వే చేస్తున్నట్టు చెప్పారు. తొలుత దేవరపల్లి గ్రామంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి ఆన్‌లైన్ వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొవ్వూరు ఆర్డీఓ ఎస్. మల్లిబాబు, ఏఎస్‌ఓ విజయభాస్కర్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, సీఎస్ డీటీ సుజాత, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు జాయింట్ కలెక్టర్ వెంట ఉన్నారు.

## పేపర్‌మిల్లు ఎదుట రిలే దీక్షలు ప్రారంభం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపుతో కదిలిన కార్మిక వర్గం
- మద్దతు తెలిపిన నాయకులు



కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా ఇబ్బందులు పడుతున్న కార్మికులకు న్యాయం చేయడం కోసం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రవేశ పెట్టిన ఉమ్మడి ఉద్యమ ప్రణాళికల్లో భాగంగా బుధవారం ఉదయం 7:30 గంటల నుంచి గేటు ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ శిబిరానికి ఏఐటీయూసీ, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ హాజరై మద్దతు ప్రకటించారు. మధు మాట్లాడుతూ ఒక కార్మిక నాయకుడు కార్మికుల హక్కుల్ని, చట్టాలను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. జేసీఎల్, డీసీఎల్ స్థాయి అధికారులు సైతం యాజమాన్యానికి కొమ్ముకాయడం సరికాదన్నారు. టి.అరుణ్ మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం తీరును నిరసిస్తూ 8 సంఘాలతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. 14 రోజుల పాటు వివిధ దశల్లో చేపట్టబోయే నిరసన కార్యక్రమాలను కార్మికులు సమష్టి కార్యచరణతో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను గుర్తించకుండా, పరంపర – 2 పేరుతో బయట వ్యక్తులకు ఉద్యోగాలు అమ్మడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

## వడ్డీ రాయితీ సద్వినియోగం



సమునా చెక్‌ని అందిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

### ఆర్థిక చేయూత ఇచ్చింది



'జగనన్న తోడు' పథకం ఎంతో ఆర్థిక చేయూత నిచ్చింది. స్వయం సహాయక సంఘ సభ్యురాలిగా బ్యాంకు రుణాలు తీసుకొని పచ్చళ్ళ వ్యాపారం చేస్తున్నాను. కోవిడ్ కారణంగా వ్యాపారం దెబ్బతింది. ఆ సమయంలో ఎవ్వరూ అప్పు ఇవ్వడానికి ముందుకు రాలేదు. జగనన్న తోడు పథకం ద్వారా బ్యాంకు రుణం పొందాను. దానిని చెల్లించడం ద్వారా వడ్డీ రాయితీ పొంది, తిరిగి రుణాన్ని తీసుకొని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను.

– జే. సూర్యరత్నం, రాజమహేంద్రవరం

### కుట్టు మిషన్‌తో కుటుంబ పోషణ



కుట్టు మిషను ద్వారా కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. కోవిడ్ కారణంగా కుటుంబ పోషణకు చాలా ఇబ్బందులు పడ్డాను. 'జగనన్న తోడు' ద్వారా వడ్డీ లేని రుణాన్ని అధికారులు, బ్యాంకర్లు అందించడం వలన తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్నాను. మరో మిషన్ కొనుక్కున్నాను. దీంతో మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నాను. రెండో విడత కూడా రుణం మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

– ఎం. సత్యవేణి, లబ్ధిదారు

- జగనన్న తోడు కింద మంజూరైన రుణాలు రూ.606 లక్షలు
- వడ్డీ రాయితీగా ఖాతాలకు జమ అయిన మొత్తం రూ.71.87 లక్షలు
- రాయితీ విడుదల కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్, ఎంపీ, జెడ్పీ చైర్మన్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రుణాలు సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ రాయతీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె. మాధవీలత, ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న తోడు 6వ విడత రుణ మంజూరు, వడ్డీ రాయితీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ ద్వారా బుధవారం విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్, ఎంపీతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జగనన్న తోడు ద్వారా 28,938 మందికి రూ.71.88 లక్షలు రాయితీ అందిస్తున్నామన్నారు. తిరిగి రుణాలు చెల్లించిన వారికి ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరినట్లు పేర్కొన్నారు. బ్యాంకర్లు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. జిల్లాలో 15,261 మంది దరఖాస్తులు చేసుకోగా 8,027 మందికి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేశారన్నారు. 6,061 మందికి రూ.606.10 లక్షలు రుణాలు మంజూరు చేశాన్నారు. గతేడాదికి సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు చెందిన 1930 మందికి రూ.193 లక్షలు, 21,080 మందికి వడ్డీ రాయితీ రూ 52.63 లక్షలు, పట్టణ ప్రాంతాలకు చెందిన 4,131 మందికి రూ.413 లక్షలు, 7,858 మందికి వడ్డీ రాయితీ రూ .19.24 లక్షలు అందించామన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ జగనన్న తోడు కింద తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించి వడ్డీ రాయితీకి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందిస్తున్నారన్నారు. చిరు వ్యాపారులకు కూడా వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వ్యాపార అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, రాష్ట్ర ఖాదీ బోర్డ్ చైర్మన్ పిల్లి నిర్మల, వైఎస్సార్‌సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ ఎస్. సుభాషిణి, డిఆర్డిఏ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'నన్నయ' అభివృద్ధికి సమష్టి కృషి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో పెద్ద యూనివర్సిటీగా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీని ఆ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె. హేమచంద్రారెడ్డి సూచించారు. యూనివర్సిటీని బుధవారం సందర్శించిన ఆయనకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి సమావేశమయ్యారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చిన తరువాత విద్యారంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో క్వాలిటీ విద్యను అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఉపకార వేతనాలు, జీతాలు, విద్యాభివృద్ధికి సంబంధించి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. యూనివర్సిటీలు సమాజ విలువలను పెంపొందించే కేంద్రాలని, ఇక్కడ వర్గ వైషమ్యాలను విడనాడి ప్రతి ఒక్కరూ యూనివర్సిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ వీసీగా ఇటీవలనే బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో క్వాలిటీ విద్యను అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మనమంతా పనిచేయాలన్నారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన రాజమహేంద్రవరంలో ఏర్పడిన 'నన్నయ' యూనివర్సిటీని కూడా అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంచే విధంగా సమష్టిగా కృషి చేద్దామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్డీ ఆచార్య ఎస్.టేకి, డీన్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక

తొండంగి: బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయి జట్టుకు బెండపూడి జెడ్పీ హైస్కూలు విద్యార్థి వెంటూరి గోవర్ధన శివదుర్గా సుదర్శన్ ఎంపికైనట్టు హెచ్‌ఎం. జి. రామకృష్ణారావు బుధవారం తెలిపారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన పోటీల్లో టీమ్ కెప్టెన్‌గా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడన్నారు.

# సంప్రదాయ ఘుమఘుమలు

- సంక్రాంతి పిండివంటల తయారీలో మహిళలు
- షాపుల్లోనూ పెద్ద పండగ సందడి
- ఆధునికతను అద్దుకుంటున్న స్వీట్లు
- ఆన్‌లైన్‌లోనూ వ్యాపారం



ఇంటి వద్ద సంక్రాంతి పిండివంటలు తయారు చేస్తున్న మహిళలు



ఇంటి వద్ద తయారు చేసిన సంప్రదాయ పిండివంటలు



కలకండ కజ్జికాయలు



ఓ స్వీట్ షాపులోని సంక్రాంతి పిండివంటలు



పొంగడాలు

మండపేట: అమ్మమ్మ చేసే సున్నుండలంటే నాకెంతో ఇష్టం.. నానమ్మ చేసే కజ్జికాయలు ఎంతో బాగుంటాయి.. సంక్రాంతి పండగల్లో ప్రతీ ఇంటా వినిపించే మాటలివి. స్వీట్లలో కొత్త వెరైటీలు ఎన్నొచ్చినా పెద్ద పండగ వస్తోందంటే సంప్రదాయ పిండివంటలదే పైచేయి. కోవా, కలకండ, డ్రైఫ్రూట్స్‌తో పోకుండలు, కజ్జికాయలు మరింత మాధుర్యాన్ని అందిస్తున్నాయి. పేద, ధనిక తారతమ్యం లేకుండా పల్లెల్లో ప్రతీ ఇంటా పిండివంటల తయారీకి ప్రాధాన్యమిస్తుంటారు. వారి స్థోమతను బట్టి జంతికలు, సున్నుండలు, చల్లగుత్తులు, పోకుండలు, రవ్వలడ్డూలు, పొంగడాలు, అరిసెలు, మైసూర్‌పాకం, కారంబూందీ తదితర సంప్రదాయ పిండి వంటలు తయారుచేస్తుంటారు. కొత్తగా వివాహం జరిగిన ఇంటిలో పిండివంటల తయారీ మరింత సందడిగా ఉంటుంది. పండగకు వచ్చే కొత్త అల్లుళ్ల కోసం అత్తలు ఎన్నో వెరైటీల వంటలు తయారు చేస్తుంటారు. ఎక్కువగా పిండి వంటలు చేయడం ద్వారా దూర ప్రాంతాల నుంచి పండగ కోసం వచ్చిన తమ కుటుంబ సభ్యులు తిరిగి వెళ్లే సమయంలో వాటినందిస్తుంటారు. ఇంట్లో చేసిన వండిన వంటకాలను ఇరుగు పొరుగు పరస్పరం ఇచ్చుకుంటూ ఆప్యాయతలను పంచుకుంటారు. రోజుల తరబడి వాటి మాధుర్యాన్ని ఆస్వాదిస్తుంటారు.

**స్వీట్స్ షాపుల్లో సంక్రాంతి సందడి**

ఇళ్ల వద్ద పిండివంటలు తయారు చేసుకునే తీరిక లేక స్వీట్స్ షాపుల్లో కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పట్టణాల్లో పెరుగుతోంది. ఏడాది పొడవునా బెంగాలీ, కలకండ, కోవా, కాజూ పేస్ట్ తదితర వెరైటీ స్వీట్స్ తయారుచేసే యజమానులు సంక్రాంతి పండగల్లో సంప్రదాయ పిండి వంటల తయారీకి ప్రాధాన్యమిస్తున్నారు. పోకుండలు, కజ్జికాయలు, బూరెల్లో కొబ్బరి పూర్ణంకు బదులు కోవా, కలకండ, డ్రైఫ్రూట్స్‌తో ఆధునికతను జోడిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తాపేశ్వరం, ఆత్రేయపురం, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర చోట్ల పేరొందిన స్వీట్ షాపులతో పాటు చిన్నచిన్న దుకాణాల్లోనూ పిండి వంటల తయారీ ఎక్కువగా కనిపిస్తోంది. దూరప్రాంతాల్లో స్థిరపడిన వారి ఆన్‌లైన్ ఆర్డరు మేరకు స్వీట్ షాపుల వారు ఆర్టీసీ, ఇతర పార్శిల్ సర్వీసుల ద్వారా సంప్రదాయ పిండివంటలను పంపిస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట తదితర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, విజయనగరం, కడప, నెల్లూరు, తిరుపతి తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ, చెన్నై, బెంగళూరులకు సంప్రదాయ పిండివంటల రవాణా జరుగుతోంది.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

66 గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివనాగబాబు

గోకవరం: తాళాలు వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరించిన సంఘటన గోకవరంలో పాలెపువారి తోటలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గండి లక్ష్మణ్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 1న తాడేపల్లిగూడెం వెళ్లి బుధవారం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు బీరువాలో ఉంచిన 66 గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు కనిపించలేదు. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ యూవీ శివనాగబాబు సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం అందించడంతో రాజమహేంద్రవరం క్లూస్ టీం చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## పేపరు మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డిని అమరావతిలో కలిసిన ఎమ్మెల్యే రాజా

- కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించిన ఎంపీ మిథున్ రెడ్డి
- అమరావతిలో కలిసి వివరించిన ఎమ్మెల్యే రాజా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, లోక్‌సభలో వైఎస్సార్ సీపీ పక్ష నేత పి.మిథున్‌రెడ్డి ఫోన్‌లో కలెక్టర్ మాధవీలతకు సూచించారు. తమ హక్కుల పరిరక్షణ కోసం పేపర్ మిల్లు కార్మికులు రిలే నిరాహార దీక్షలతో పోరాటానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఈ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం అమరావతి వెళ్లారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మిథున్ రెడ్డిని కలిసి..పేపర్‌మిల్లులో జరుగుతున్న అక్రమాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సీనియర్ కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం జరిగేలా పరంపర-2 పేరుతో జరుగుతున్న ఉద్యోగాల భర్తీ, కార్మిక సంఘాలకు మూడున్నరేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం, వేతన సవరణ ఒప్పందం జరపకపోవడం, మహిళా కార్మికులను పర్మినెంట్ చేయకపోవడం వంటి పలు కీలక అంశాలను మిథున్‌రెడ్డికి వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులను రాజా కలుసుకుని పేపర్ మిల్లు సమస్యను వివరించారు.

# తెలవారక ముందే 'బార్లా'తెరుచుకుని..

- నిబంధనలకు తూట్లు
- పట్టించుకోని అధికారులు



తెల్లవారు జామునే తెరిచిన సామర్లకోటలోని బార్

సామర్లకోట: తెల్లవారక ముందే 'బార్లా' తెరుస్తున్నారు.. అడిగేవారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. సామర్లకోటలో సత్యనారాయణపురం వెళ్లే మార్గాల్లో ఒకవైపు బార్, మరోవైపు ప్రభుత్వ మద్యం షాపు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్యం షాపు నిర్ణయించిన సమయానికే తెరిచి మూసి వేస్తున్నారు. అయితే బార్ మాత్రం సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిబంధన ప్రకారం బార్ ఉదయం 11 గంటలకు తెరిచి 11 గంటలకు మూసి వేయాలి. ఉదయం ఆరు గంటల నుంచే బార్ తెరిచి అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. దీనివల్ల ఉదయం, రాత్రి సమయంలో రాకపోకలు సాగించే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో ఒకవైపు బార్, మరోవైపు మద్యం షాపు ఉండటంతో ఆయా రోడ్లలో మందుబాబులు మద్యం తాగుతున్నారు. ఈ విషయంపై గతంలో ఫిర్యాదు చేయగా అప్పట్లో ఎక్సైజ్ ఎస్సై తనిఖీలు చేసి సమయం ప్రకారం మాత్రమే బార్ తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆ నిబంధనలను వారు మళ్లీ విస్మరిస్తున్నారు.

**వాహనాల పార్కింగ్‌తోనూ ఇబ్బంది**

సత్యనారాయణపురం మార్గంలో వాహనాల పార్కింగ్‌ను ఇష్టానుసారంగా చేయడంతో ఇబ్బందిగా మారుతుంది. ఈ మార్గంలో మహిళలతో పాటు ఆ రోడ్డులో ఉన్న స్కూల్‌కు వెళ్లే విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బార్‌లో మద్యం కొనుగోలు చేసుకున్న కొంతమంది మందుబాబులు ఆ రోడ్డులో కల్వర్టు తూములపై మద్యం సీసాలు ఉంచుకొని గుంపులు, గుంపులుగా మద్యం తాగుతున్నారు. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో ఈ పరిస్థితి మరింత చేయిదాటింది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**సమయ పాలన పాటించేలా చూస్తాం..**

బార్ సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై మద్యం తాగడం నేరం. ఈ మేరకు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. సత్యనారాయణపురం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా బార్, మద్యం షాపులో ఏదో ఒకటి మార్పు చేయడానికి కృషి చేస్తా.

–చైతన్య మురళీ, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, కాకినాడ

# పరీక్షా విధానంలో మార్పులు

'నన్నయ' ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో అత్యంత పారదర్శకతతో కూడిన పరీక్షా విధానాన్ని అమలు చేసేలా టెక్నాలజీ సహకారంతో పరీక్ష విధానంలో కొన్ని మార్పులు తీసుకువస్తామని ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సమర్థంగా పరీక్షల నిర్వహణకు.., ఫలితాల ప్రకటనకు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోనున్నామన్నారు. ఇందులో భాగంగా ఈడీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) విధానంలో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయదలచామన్నారు. 'నన్నయ'లో డిగ్రీ, పీజీలలో అన్నింటిలోను పూర్తి స్థాయిలో దీనిని అమలు చేయదలచామన్నారు. జేఎన్‌టీయూకే సిబ్బందిని రప్పించి అవగాహన కలిగిస్తామన్నారు. విద్యాబోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండాలని, లేకుండా ఆయా కళాశాలలపై యాక్షన్ తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనుబంధ కళాశాలలకు అకడమిక్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాల గురించి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన వాటిని పనులు పూర్తయ్యేలా ప్రయత్నిస్తానని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పాల్గొన్నారు.



# సమష్టి కృషితో అంతర్వేది ఉత్సవాలు

మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



అంతర్వేదిలో ఉత్సవాలపై సమీక్షిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో ఎస్పీ తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ జరుగనున్న స్వామివారి కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై బుధవారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఇరుకు రోడ్లలో రాకపోకలకు అంతరాయం కలగకుండా, తొక్కిసలాట జరగకుండా ముందస్తు కార్యాచరణ చేయాలన్నారు. తీర్థంలో పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆర్డీవో వసంతరాయుడు మాట్లాడుతూ స్వామి కల్యాణం, రథోత్సవం, పౌర్ణమి స్నానాలకు తరలివచ్చే భక్తుల రద్దీకి తగ్గట్టుగా ముందు చూపుతో పనులు చేపట్టాలన్నారు. ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. భక్తుల క్యూ వద్ద, తీర్థంలో పటిష్ట నిఘా ఉంచుతామన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో జిల్లా పరిషత్ నుంచి తగిన సహకారం అందజేస్తామన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలకు ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. రథానికి మెరుగులు దిద్దుతున్నామని, భక్తుల క్యూలైన్లకు ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 26వ తేదీలోగా దేవస్థానం తరఫున అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ సమక్షంలో ఆర్డీవో వసంతరాయుడు ఆయా శాఖల యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కేవీ రమణ, ఎండోమెంట్స్ డీసీ ఎం.విజయరాజు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు చొప్పల బాబూరావు, బైర నాగరాజు, సర్పంచులు కొండా జాన్ బాబు, ఒడుగు శ్రీను పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బంది రానీయొద్దు

సఖినేటిపల్లి: అంతర్వేది ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది రాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశించారు. సమీక్షలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్డు, బీచ్‌లో దుస్తులు మార్చుకునే గదులు తగినన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలకు సూచించారు. అధికారులు సమన్వయంతో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## తల్లిదండ్రులను విడిచిపెట్టినా, వేధించినా నేరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తల్లిదండ్రులను విడిచిపెట్టినా, వారిని మానసికంగా వేధించినా, కొట్టినా, బెదిరించినా చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి తెలిపారు. బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో వయోవృద్ధుల సంక్షేమంపై న్యాయవిజ్ఞాన సదస్సును ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చట్టపరంగా వయోవృద్ధ పౌరులకు గల హక్కులు, సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టిన తల్లిదండ్రులు, వయోవృద్ధుల భరణం, పోషణచట్టం 2007 గురించి వివరించారు. వృద్ధులపై నేరాలు జరిగితే స్వయంగా కానీ, వృద్ధుల సంక్షేమ సంస్థల ద్వారా కానీ న్యాయసంస్థలకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. నిరాశ్రయులైన వృద్ధులు కనిపించినా, వారిపై జరిగే అన్యాయాలను తెలియజేయాలన్న వయోవృద్ధుల హెల్ప్‌లైన్ నంబర్ 14567ను సంప్రదించవచ్చన్నారు. ప్యానల్ లాయర్ డి.వెంకటేశ్వరరావు, డిజేబుల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ డిజేజే పురుషోత్తం,అసోసియేట్ ప్రెసిడెంట్ సంజీవరావు, ప్రజాసంక్షేమ వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్‌జైన్, ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం ప్రసాద్, పారాలీగల్ వలంటీర్ వరప్రసాద్, ఉభయగోదావరి జిల్లాల ఎల్డర్ లైన్ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ పుష్పాంజలి పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలి

- కలెక్టర్ కృత్తికా శుక్లా



శ్రీ ప్రకాష్ టీటీ క్రీడాకారులనుద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కనపర్చి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నారు. పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు హాజరైన క్రీడాకారులనుద్దేశించి బుధవారం ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కాకినాడ జిల్లాలో అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీ ప్రకాష్ టీటీ అకాడమీ నుంచి నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. క్రీడలకు ఉన్నత స్థానాన్ని కల్పించిన శ్రీ ప్రకాష్ యాజమాన్యాన్ని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని కనపర్చి గెలుపునకు ముందడుగు వేయాలన్నారు. 24 క్లస్టర్‌ల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు ఐదురోజుల పాటు జరిగే టీటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. స్లోవేనియాకు చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ దంజన్‌కోబాల్, మలేషియాకు చెందిన డాక్టర్ మురుగన్‌రాజు, ప్రొఫెసర్ మిరియం అమృత్, మహారాష్ట్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆర్‌ఎస్ మాలీ, అకడమిక్ సలహాదారు డాక్టర్ మాధవరావు (మెల్‌బోర్న్) ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు సైరస్ రైస్ ఇండస్ట్రీస్ అందించిన బియ్యం, ఇడ్లీ రవ్వ, గోధుమ పిండితో కూడిన కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆర్డీఓ జేఎస్ రామారావు, తహసీల్దార్ జితేంద్ర, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, రిఫరీలు సూర్యారావ్, వేణుగోపాల్, లలితా ఇండస్ట్రీ ఈడీ మట్టే ఆదీష్ పాల్గొన్నారు.